క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



నగరం: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదేనని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పాల్గొని, మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలను కూడా పర్యవేక్షించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. తొలుత శాఖల వారీగా సమీక్ష జరిపారు. సమావేశంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, తహసీల్దారు ప్రమీల, ఎంఈవో హరిబాబు, పలు శాఖల అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



వేమూరు: ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి తెలియజేయాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకరావు అన్నారు. వేమూరు మండల కేంద్రంలో ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇస్లాం పేటలో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు వల్ల నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో దున్నా మేరీసు బాబు, గుమ్మడి దానియేలు, షేక్ రఫీ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో వెల్లటూరు క్యాడెడ్స్ ప్రతిభ



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెడ్స్ పొన్నూరు మండలం గోళ్లమూడిపాడులోని నాట్కో స్కూల్ ఆఫ్ లెర్నింగ్ హైస్కూల్‌లో జరిగిన ఎన్‌సీసీ క్యాంప్‌లో ప్రతిభ చూపారు. ఈ క్యాంప్‌లో మెడల్స్ సాధించిన వారిలో గుడిపల్లి వర్షిణి, సుంకర యశస్విత, సీహెచ్ మోహన కృష్ణ, సమ్మెట గణేష్‌లు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉమామహేశ్వర్ చేతుల మీదగా సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ క్యాంప్‌లో పాల్గొన్న మిగిలిన 33 మంది క్యాడెట్స్‌కు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. అరుణకుమారి, శిక్షణ ఇచ్చిన ఎన్‌సీసీ ఆఫీసర్ కొండపల్లి కుటుంబ రావు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించారు.

రేపట్నుంచి కొల్లిపరలో కొలుపులు

కొల్లిపర: కొల్లిపర గ్రామంలో ఆదివారం నుంచి గ్రామ దేవతలైన గంగానమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, మద్దిరావమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మత సమైక్యతకు తార్కాణంగా మదార్ సాహెబ్‌కు ప్రాముఖ్యతనిస్తూ గ్రామ కొలుపులను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తీర్మానించారు. శుక్రవారం గ్రామ పెద్దలు మాట్లాడుతూ కొలుపుల్లో ముస్లింలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వటం వల్ల హిందువులు, ముస్లింలు ఒకటే అని ఇరువురిలో సోదర భావం పెరుగుతుందన్నారు. గ్రామంలో గత కొన్ని శతాబ్దాలుగా ఇరువర్గాల వారు కలసి గ్రామ కొలుపు నిర్వహించటం జరుతుందన్నారు. కొలుపులు 19న ప్రారంభమై డిసెంబరు మూడు వరకు జరుగుతాయన్నారు. ఈ విధంగా పూర్వకాలంనుంచి గ్రామంలో కొలుపులు రెండేళ్లకొసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బట్టీ పట్టే విధానానికి స్వస్తి



తెనాలిఅర్బన్: బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శుక్రవారం చిన్నారులు వారి తల్లిదండ్రులతో కలసి వివిధ రకాల గృహాల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ బట్టి పట్టే విధానానికి స్వస్థి పలికి నమూనాల ద్వారా చిన్నారుల్లో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

పలు గ్రామాలలో భక్తిశ్రద్ధలతో మహిళలు పూజలు



రేపల్లె రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రస్వామికి పాలు పోస్తున్న భక్తులు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాగేంద్రుని పుట్టలో పాలు పోసేందుకు మహిళలు తెల్లవారుజామున పుణ్య స్నానాలు ఆచరించి, వడపప్పు, ఆవు పాలతో ఆలయాలకు చేరుకున్నారు. పుట్టలో పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. నల్లమోతువారిపాలెం జాతీయ రహదారి పక్కనే గల నాగేంద్రుని పుట్ట వద్ద గ్రామ సర్పంచ్ మాడా సుబ్రమణ్యం, మహిళలు పూజలు నిర్వహించారు. చింతాయపాలెంలోని సారకాయలంకమ్మ తల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్దా, యాజలి, దమ్మనవారిపాలెం, కొత్త నందాయపాలెం గ్రామాల్లో నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రుని పుట్ట వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం నాగేంద్రుని పుట్ట వద్ద, కాశీవిశ్వనాథస్వామి దేవాలయ ఆవరణలోని సుబ్రమణ్యేశ్వర స్వామికి, గీతా మందిరం, పిట్టలవానిపాలెం సాయిబాబాదేవాలయం, అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణ, అల్లూరు శివారు రెడ్లపాలెం సమీపంలో గల శ్రీ శేషాచలమేశ్వర స్వామి దేవాలయం, మంతెనవారిపాలెం శ్రీరామ లింగేశ్వర స్వామి దేవాలయం, పిట్టలవానిపాలెం శివారు దేగల వారిపాలెంలోని నాగేంద్రుని పుట్ట, గోకరాజునల్లిబోయినవారిపాలె, సంగుపాలెం, కోడూరు గ్రామాల్లో నాగుల చవితి సందర్భంగా నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేగలవారిపాలెం నాగేంద్రస్వామి వారి పుట్ట వద్ద పిట్టువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పులుగు సముద్రాలరెడ్డి మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించిన మురళీ కృష్ణ కోలాట భజన అత్యంత ఆసక్తి కరంగా సాగింది. కోలాట భజన చూపరులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. డేంలవారిపాలెం పుట్ట వద్ద 2 వేల మందికి అన్న సంతర్పణ చేశారు.

నాగుల చవితి ప్రత్యేక పూజలు

చెరుకుపల్లి: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. మంహిళలు వేకువజామునే ప్రత్యేక స్నానాలు ఆచరించి కార్తిక మాసం నేపథ్యంలో శివాలయాల్లో దీపాలు వెలిగించి, నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. గూడవల్లి బాడవలో వేంచేసియున్న శ్రీ ఖరేశ్వర స్వామి గుడివద్ద గుళ్లపల్లి నాగేంద్ర స్వామి పుట్టలలో సలివిడి, గుడ్లు, పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా నాగుల చవితి పర్వదినం

రేపల్లె రూరల్: నాగుల చవితి పర్వదిన వేడుకలను పలు నాగేంద్రస్వామి ఆలయాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం, పేటేరులోని ఆంజనేయస్వామి ఆలయం, ఉప్పూడిలో, మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం, బేతపూడి గ్రామంలో బేతపూడమ్మ అమ్మవారి ఆలయంలో వెలసిన నాగేంద్రస్వామి పుట్టలకు ఉదయం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలతో పుట్టను అలంకరించి నివేదనలు చేశారు. భక్తులు స్వామివారికి ఆవుపాలు సమర్పించి పుట్టలో అరటిపండ్లు, పొంగళ్లు, కోడిగుడ్లు సమర్పించి పసుపు, కుంకుమలతో పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి పుట్ట మన్నును స్వీకరించి ఆనవాయితీగా చెవులకు అలంకరించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మోళ్లగుంట, లంకెవానిదిబ్బ, అరవపల్లి తదితర గ్రామాలలోనూ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ఘనంగా నాగుల చవితి

భట్టిప్రోలు: నాగుల చవితి పర్వదినాన్ని శుక్రవారం భట్టిప్రోలు మండలంలో ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు గంగాపార్వతీ సమేత విఠలేశ్వరస్వామి దేవాలయం, కోనేటిపురంలో కొలువైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న పుట్టల్లో భక్తులు నాగుల చవితి పూజలు నిర్వహించారు. దేవాలయ ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. కోనేటిపురం ఆలయంలో బాలస్వామి, యునెస్కో వాస్తు పండిట్ అవార్డు గ్రహీత వంగర చలమయ్య సిద్దాంతి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అలాగే విఠలేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో మహా నాగ పడిగకు భక్తులు పూజలు నిర్వహించారు. వెల్లటూరులో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. వేమవరంలో కొలువైన రుక్మాభాయి సహిత పాండురంగస్వామి వారి దేవాలయంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు జరిగాయి. పూజా కార్యక్రమాలను ధారా నారాయణమూర్తి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. పెదపులివర్రు బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రాతఃకాలంలో పూజలు నిర్వహించి, పంచహారతి ఇచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ నిర్వహించగా కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, శివాలయం ఛైర్మన్ జంపని అంజయ్య పర్యవేక్షించారు.

నాగేంద్రుడి పుట్ట వద్ద పూజలు

కొల్లూరు : నాగుల చవితి సందర్భంగా కొల్లూరులోని బైపాస్ రోడ్డు, లాక్ సెంటర్‌లోని నాగేంద్రుని గుడి, దోనేపూడి తిరుపతమ్మ ఆలయం, ఆవులవారిపాలెంలోని రామాలయం సమీపంలోని పుట్టల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పూజలు జరిపారు.



దేగలవారిపాలెం నాగేంద్రుని పుట్ట వద్ద కోలాట భజన



కొల్లూరులో నాగేంద్రుడి పుట్ట వద్ద..



విఠలేశ్వరస్వామి మహా నాగ పడిగకు పూజలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



కర్లపాలెంలో గ్రంథాలయంలో చిన్నారుల వేషధారణలు



చిత్రలేఖనంలో చెరుకుపల్లి విద్యార్థులు



భట్టిప్రోలులో గ్రంథాలయంలో..



కొల్లూరులో విద్యార్థుల ర్యాలీ

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కర్లపాలెం శాఖ గ్రంథాలయాధికారిణి టీవీ రమణమ్మ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా శుక్రవారం ఖోఖో పోటీలను కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. అనంతరం బాలికలకు పలు వేషధారణ పోటీలు నిర్వహించారు. ఎంతో మంది గ్రంథాలయాల్లో చదివిన వారు ఉన్నత స్థానానికి చేరుకున్నారని పేర్కొన్నారు. పీఈటీ సుబ్బారెడ్డి, ఇందుమతి తదితరులున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

చెరుకుపల్లి: విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని స్థానిక లైబ్రేరియన్ కె.అరుణ అన్నారు. చెరుకుపల్లి శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50 మంది వరకు పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనంపై సదస్సు

భట్టిప్రోలు: స్థానిక మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో శుక్రవారం తెలుగు భాష గొప్పతనంపై సెమినార్ నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయుడు నందం వెంకటేశ్వరరావు, ఏఈఎస్ (డీఎస్) ఉపాధ్యాయుడు అమ్మిశెట్టి నాగరాజు, విశ్రాంత హెచ్ఎం భట్టిప్రోలు జనార్దనప్రసాద్ తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియచేశారు. తెలుగు పద్యాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 44 మంది పాల్గొన్నారు. అనంతరం పురవీధులలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్, పాఠకులు పాల్గొన్నారు. అలాగే చుండూరు మండలం వలివేరు శాఖా గ్రంథాలయంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎ. బాలసుబ్రహ్మణ్యం, బీఏ లలిత కుమారి, గ్రంథాలయ అధికారి శివ కుమార్ పాల్గొన్నారు.

వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు

అమర్తలూరు(వేమూరు): గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని వ్యాస రచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించడం జరిగిందని లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వారోత్సవాలు ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

జనరల్ నాలెడ్జ్ పోటీలు

దుండిపాలెం(వేమూరు): విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని దండిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిపూర్ణ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శుక్రవారం జనరల్ నాలెడ్జ్‌పై పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పి.రమాదేవి, కె.కల్యాణి, యడ్లపల్లి గ్రంథాలయాధికారి కారిణి, బి.గిరిజా సుందరి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన కేంద్రాలు

కొల్లూరు: విద్యార్థులకు గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జక కేంద్రాల వంటివని కొల్లూరు ఈఓ బి. మల్లికార్జున అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పునస్కరించుకుని ప్రజలలో గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కొల్లూరు వీధులలో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థులకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, శ్రీనివాసాచార్యులు, సుధాకర్, రాజేష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు వై.రాంబాబు, జి.కనకదుర్గ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ యల్లయ్య

రేపల్లె: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య అన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై రేపల్లె మలేరియా యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని అయోవా బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. నివాస పరిసర ప్రాంతాలలో తేమ వాతావరణం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని, నిద్రించే సమయంలో దోమల తెర వినియోగించాలని సూచించారు. జ్వరం, వాంతులు ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే విధిగా వైద్యుడిని సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పులి వెంకటేశ్వరరావు, హెల్త్ విజిటర్ పువ్వాడ పద్మావతి, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్త కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వేమూరు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీవో ఎం.అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యల్లమాటి మోహన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివధ శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తితో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వల్లూరు(కాకుమాను): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో మద్యం అమ్మినా, బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుకన్య హెచ్చరించారు. మండలంలోని వల్లూరులో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం ఆమె ఎస్ఐ గీతిక ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇంకొల్లు వెంకట రామబ్రహ్మం మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అతని వద్ద పది క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా, మద్యం విక్రయించినా సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారతదేశ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక సవాళ్లు, వ్యూహాలు – ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సూచన' అనే అంశంపై ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్ ఆచార్య కె. మధుబాబు మాట్లాడుతూ సదస్సులో 12 ప్రత్యేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామని చెప్పారు. సదస్సులో ఉత్తరాఖండ్ డూన్ యూనివర్సిటీ డీన్, ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య పి. మంగైన్ కీలకోపన్యాసం చేయనున్నారని, ప్రత్యేక ఆహ్వానితులుగా తుల్జాపూర్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అధ్యాపకులు ఆచార్య జైన్ హాజర వుతారని తెలిపారు. జనవరి 25లోగా పరిశోధనలను సమర్పించాలని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఎకనామిక్స్ విభాగ హానరరీ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎస్ రాజు, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

కిస్తీలు చెల్లించలేక.. మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



తలపాల సురేష్

రేపల్లె రూరల్: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని 18వ వార్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ హరిబాబు వివరాల మేరకు.. 18వ వార్డు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తలపాల సురేష్(21) టైల్స్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఓ ద్విచక్ర వాహనాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించే విధంగా ఏడు నెలల క్రితం ఓ ఫినాన్స్ కంపెనీ ద్వారా కొనుగోలు చేశాడు. గత మూడు నెలలుగా నెలవారీ కిస్తీలు చెల్లించకపోవటంతో.. ఫినాన్స్ సంస్థ ప్రతినిధులు సురేష్‌తో రెండు రోజుల్లో కిస్తీ చెల్లించకపోతే బండి సీజ్‌చేస్తామని చెప్పారు. అయితే అతని వద్ద నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని, గమనించిన భార్య వెంకటేశ్వరమ్మ స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి సురేష్‌ను కిందకు దింపగా అప్పటికే అతను మృతి చెందాడన్నారు. వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు.

నడింపాలెంలో కేంద్ర బృందం పర్యటన



నడింపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బృందం

నడింపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని నడింపాలెంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. సెంట్రల్ సెక్రటేరియెట్‌లోని వివిధ శాఖల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా చేస్తున్న ఆదిత్యశర్మ, నరేష్ రావని, రిశ్వా గుప్తా, మనోజ్‌నాయక్, కృష్ణకాంత్ చక్రవర్తి, అంకిత్‌రాజ్‌లు గ్రామంలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ)తో పాటు గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్ని పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో జరుగుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించే విధానం, ప్రత్యేక వాహనాల ద్వారా సెంటరుకు తరలించడం, తడి, పొడి చెత్తలను వేరు చేయడం, వాటి ద్వారా సంపద సృష్టిస్తున్న విధానాలతో పాటు వర్మీకంపోస్టు తయారీ, తద్వారా పంచాయతీకి సమకూరుతున్న ఆదాయం వివరాలను పంచాయతీ కార్యదర్శి ఖాజా బృందానికి వివరించారు. అనంతరం గ్రామ సచివాలయం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలు, వాటి అమలు విధానం, డిజిటల్ చెల్లింపులు, ప్రజలకు అందుతున్న డిజిటల్ సేవల్ని నిశితంగా పరిశీలించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలు, కల్పిస్తున్న సౌకర్యాలను అంగన్‌వాడీ సిబ్బంది బృందానికి తెలియజేశారు. వెంట నోడల్ అధికారి నాగానంద్, అసిస్టెంట్ నోడల్ అధికారి జి.వి.ఆర్.కె. గుప్తా, ఈవోపీఆర్డీ మావులూరి మోషే, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సర్పంచ్ లాం రత్నకుమార్, స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, ఐటీసీ ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

రేపల్లె: సమాజంలో బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కకరూ ప్రధాన పాత్ర పోషించాలని మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు అన్నారు. బాల్య వివాహాలతో చోటు చేసుకునే అనర్థాలపై సిఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పేటేరు గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఐసీడీఎస్, పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలతో భార్యభర్తలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, సిఫార్డ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొమ్మమూరు చానల్‌లో బాపట్ల యువకుడి గల్లంతు



అప్పాపురం(కాకుమాను):మండలంలోని అప్పాపురం వద్ద కొమ్మమూరు చానల్‌లో యువకుడు గల్లంతైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది.ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు... బాపట్లకు చెందిన షేక్ జానీబాషా అనే యువకుడు గురువారం అప్పాపురంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి పది గంటల సమయంలో ప్రమాదవశాత్తు కొమ్మమూరు చానల్‌లో పడి కొట్టుకుపోయాడు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. యువకుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.



